

ప్రాణాపాయస్థితిలో చిన్నారి

పేదింటి చిన్నారికి పెద్ద కష్టం వచ్చింది. తొమ్మిది నెలల వయస్సులో ప్రాణాపాయస్థితిలో ఉన్నాడు.

- 8లో



ఆలయాలను పరిరక్షించాలి

పురాతన ఆలయాలను పరిరక్షించాలని పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి కోరారు.

- 8లో

గరిష్టం / కనిష్టం

34° / 26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శిక్షణ పొందిన టీచర్స్‌తో ప్రీస్కూల్ కార్యక్రమాలు



మాట్లాడుతున్న కేవీ కృష్ణవేణి

భువనగిరిటౌన్: అంగన్‌వాడీ టీచర్లను మూడు బ్యాచ్‌లుగా చేసి మూడు రోజులపాటు శిక్షణ ఇస్తున్నామని, పూర్తి శిక్షణ పొందిన టీచర్స్‌తో ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా సంక్షేమ అధికారి కేవీ కృష్ణవేణి తెలిపారు. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లగా తీర్చిదిద్దేందుకు అంగన్‌వాడీ టీచర్లకు చేపట్టిన శిక్షణ కార్యక్రమం భువనగిరి ప్రాజెక్ట్‌లో సీడీపీఓ రేఖల స్వరాజ్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శుక్రవారం మొదటి బ్యాంచ్ ముగింపు కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని పూర్వ ప్రాథమిక వాచకం - 1, పూర్వ ప్రాథమిక విద్యా కరదీపికలను అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ రమ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం



అద్దాల మండపంలో అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ తిరు, మాడ వీధుల్లో సేవను ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్ఠించి ఊంజలి సేవ జరిపించారు. ఇక.. ప్రధానాలయంలో నిత్య పూజలు యథావిధిగా కొనసాగాయి. అనుబంధ ఆలయమైన శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు.

వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలి



హాస్టల్ భవన ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జిల్లా బీసీ సంక్షేమ అధికారి రమణి

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బీసీ బాలుర వసతి గృహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి రమణి అన్నారు. చౌటుప్పల్‌లోని హాస్టల్ భవనాన్ని శుక్రవారం ఆమె ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావుతో కలిసి పరిశీలించారు. హాస్టల్‌లో కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు.

28న బహిరంగ వేలం

వలిగొండ: మండలంలోని వెంకటాపురంలో శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వ్యాపార సముదాయాల హక్కు, తలనీలాలు సమకూర్చుకునేందుకు, శ్రీ సత్యనారాయణ వ్రత సామగ్రి, కొబ్బరికాయలు, వాహన పూజా సామగ్రి అమ్మకం, ఫొటోస్టూడియో నిర్వహణ, కొబ్బరి చిప్పలు సమకూర్చడం, కూల్ డ్రింక్స్, హోటల్ నిర్వహణకు ఈ నెల 28న టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి మోహన్‌బాబు శుక్రవారం తెలిపారు. ఈ నెల 26 ఆలయ హుండీలు లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు పూర్తిచేసి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు.

రుణమాఫీ!

జిల్లాలో లక్ష మంది రైతులకు పైగా లబ్ధి

- రుణమాఫీపై స్పష్టత ఇచ్చిన ప్రభుత్వం
- ఐదేళ్ల కాలానికి వర్తించనున్న మాఫీ
- రూ.2లక్షల వరకు మాఫీ అమలుకు నిర్ణయం



సాక్షి, యాదాద్రి: యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి సాక్షిగా రూ.2లక్షల రుణమాఫీని ఆగస్టు 15లోపు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరి ఎన్నికల సభలో హామీ ఇచ్చారు. ఈమేరకు పంట రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం దీనిపై స్పష్టమైన ప్రకటన చేసింది. రుణమాఫీ అమలు విధివిధానాలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలోని సబ్ కమిటీ నిర్ణయిస్తుందని, వచ్చే నెల 15లోగా కమిటీ తమ నివేదికను అందజేస్తుందని సీఎం ప్రకటించారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు లక్ష మంది రైతులకు ప్రయోజనం కలగనుంది.

వివరాలు సరిచూసుకునే పనిలో..

వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 2,71,979 మంది రైతులు ఉన్నారు. వీరిలో సుమారు లక్ష మంది రైతులు ఆయా బ్యాంకుల నుంచి రూ.2లక్షల లోపు రుణాలు తీసుకున్న వారు ఉన్నారు. 2018 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు ఐదు సంవత్సరాల్లో తీసుకున్న రూ. 2 లక్షలు పంట రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించారు. అయితే.. గతంలో బ్యాంకుల్లో అప్పులు తీసుకున్న రైతులకు అప్పటి ప్రభుత్వం తొలి విడతలో రూ.50 వేల లోపు రుణం ఉన్నవారికి, రెండో విడతలో రూ.99 వేల వరకు రుణం ఉన్న వారిలో కొందరికి మాఫీ వర్తింపజేసింది. కొందరి రైతుల ఖాతాల్లో డబ్బులు కూడా జమ అయ్యాయి. చాలా మందికి పాత రుణం రద్దు చేసి వారికి తిరిగి కొత్త పంట రుణాలు మంజూరు చేశారు. చాలా మంది రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు రెన్యూవల్ చేయలేదు. ప్రభుత్వం ప్రకటనతో పంట రుణాలను తీసుకున్న రైతుల రుణమాఫీ కోసం అధికారులు బ్యాంకుల వారీగా అర్హుల జాబితా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులు, గ్రామీణ బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాలపై అధికారులు అంచనా వేశారు. బ్యాంకుల వారీగా ఎంత మంది రుణాలు తీసుకున్నారు. వడ్డీ ఎంత? ప్రస్తుతం ఉన్న రుణం ఎంత..? తదితర వివరాలను సేకరించారు. ఇప్పటికే తమ వద్ద ఉన్న రుణ మాఫీ లెక్కలను మరోసారి సరి చూసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రభుత్వం మాఫీకి సంబంధించిన జారీ చేసే విధివిధానాల కోసం ఎదురు చూస్తున్నామని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. అయితే.. రూ.2 లక్షల లోపు రుణమాఫీ కుటుంబంలో ఒకరికే వర్తింపజేస్తారా.. లేక రుణం తీసుకున్న అందరికీ ఇస్తారా అనే విషయంలో విధివిధానాలు రావాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

రైతులకు మేలు జరుగుతుంది



సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన రుణమాఫీతో రైతులకు మేలు జరుగుతుంది. ఎన్నికల ముందు యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రూ. 2 లక్షలలోపు రుణం ఆగస్టు 15లోపు ప్రభుత్వం మాఫీ చేస్తుంది. రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంతో ఇక రైతులకు రుణ విముక్తి కలగనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది.

– అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

● ఆరోగ్య యోగా



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం భువనగిరి పట్టణంలోని రాచకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో యోగా ఆసనాలు వేస్తున్న పోలీసు సిబ్బంది

ఆర్థికంగా ఎదిగేందుకే మహిళా శక్తి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి: మహిళా శక్తి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సెర్ప్, స్త్రీనిధి సిబ్బందికి 'మహిళా శక్తి' కార్యక్రమం అమలుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆడబిడ్డలను ఆర్థికంగా శక్తిమంతులను చేయడమే మహిళా శక్తి ముఖ్య ఉద్దేశమని, ఈ పథకాన్ని జిల్లాలో దిగ్విజయంగా అమలు చేయాలన్నారు. స్వయం సహాయ సంఘాల ద్వారా పలు రకాల సూక్ష్మ తరహా పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడం మహిళా శక్తి పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సూక్ష్మ తరహా పరిశ్రమలను గుర్తించి, అందులో సంఘాలను ప్రోత్సహించడం, ఆయా సంఘాల్లో మహిళలు తమ నైపుణ్యాలకు తగ్గ ఉత్పత్తులను ఎంచుకోవడం, అవసరమైన నైపుణ్యాన్ని అందించడం, ఉత్పత్తికి అవసరమైన ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీల సదుపాయం కల్పించడం, ఉత్పత్తి అయిన సరుకుల మార్కెటింగ్‌కు సహకారం అందించడం మహిళాశక్తి పథకంలో భాగమని పేర్కొన్నారు. మహిళా శక్తి పథకంలో భాగంగా జిల్లాలో 2024– 25కు సంబంధించి 16వేల మంది మహిళా సంఘాల సభ్యులకు రూ.87కోట్ల విలువ గల కార్యాచరణ ప్రణాళికను చేపట్టడం జరుగుతుందని చెప్పారు. మైక్రో ఎంటర్‌ప్రైజెస్, పర్మినెంట్ స్టిచ్చింగ్ సెంటర్లు, పాడి గేదెల పెంపకం, మొబైల్ ఫిష్ అవుట్‌లెట్, పాల డెయిరీల ప్రోత్సాహం, మీసేవ కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ అనుబంధ పరికరాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ తదితర 16 రకాల జీవనోపాధులు ఇందులో భాగమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఎంలు, ఏపీఎంలు, సెర్ప్, స్త్రీనిధి సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉపాధ్యాయురాలు సత్యవతి- వెంకటయ్య దంపతులను సన్మానిస్తున్న జెడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి

- జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

చౌటుప్పల్: దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, దానిని వెలకట్టలేమని జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన చౌటుప్పల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు(స్కూల్ అసిస్టెంట్) సత్యవతికి సన్మానోత్సవ సభను శుక్రవారం పట్టణ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను మొదటగా గుర్తించేది కూడా ఉపాధ్యాయుడేనన్నారు. సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని పేర్కొన్నారు. విద్యార్థులు గురువుల అడుగుజాడల్లో నడుచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కర్నె శివకుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, ప్రతినిధులు రామ్మోహన్‌రావు, వెంకటయ్య, మోటె సత్తయ్య, నర్సింహారెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

భూదాన్‌పోచంపల్లి: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని డీఎంహెచ్‌ఓ పాపారావు అన్నారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలో ఫ్రైడే డ్రైడేలో భాగంగా పలు ఇళ్లను సందర్శించారు. పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు యశోధ, శిల్పిని, మండల వైద్యాధికారిణి శ్రీవాణి, సబ్‌యూనిట్ అధికారి మధుసూదన్ ఉన్నారు.



నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



పారుపల్లి పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

రాజాపేట: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. శుక్రవారం రాజాపేట మండలంలోని మల్లగూడెం, పారుపల్లి గ్రామాల ప్రభుత్వ పాఠశాలలను ఆయన పరిశీలించారు. అనంతరం పాముకుంట గ్రామంలోని వననర్సరీని సందర్శించారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ధరణి, పెండింగ్‌లో ఉన్న రైతుల భూసమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ దినకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు తదితరులున్నారు.

నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై విచారణ జరిపించాలి

సూర్యాపేట టౌన్: నీట్ పరీక్ష పత్రం లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని వినయ్‌గౌడ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైద్య వృత్తిపై ఎంతో ఆశతో రూ.లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకొని చదువుకున్న లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంలోకి నెట్టబడిందన్నారు. బీజేపీ పాలిత బిహార్, హరియానా, గుజరాత్ రాష్ట్రాల్లో పేపర్లు లీకైనా ప్రధాని మోదీ నోరు విప్పకపోవడం శోచనీయమన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారం వెనుకాల ముమ్మాటికీ బీజేపీ హస్తం ఉందన్నారు. పేపర్ లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని, బాధిత విద్యార్థులకు సరైన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నల్లగొండ నాగయ్య, ధరావత్ రవి, షేక్ జహంగీర్, తాళ్ల వినయ్, పిడమర్తి భరత్, సాయిదీపక్ పాల్గొన్నారు.

మొదట్లోనే కష్టాలు



ఈ ఫొటోలోని రైతు పేరు పర్నె శేఖర్‌రెడ్డి. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామం. 13 ఎకరాల్లో పత్తిసాగు చేశాడు. తనకున్న ఆరున్నర ఎకరాలతోపాటు, మరో ఆరున్నర ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. వేసవిలో దుక్కి దున్ని సిద్ధంగా ఉంచాడు. వర్షాలు ప్రారంభం కాగానే జూన్ 6న పత్తి గింజలు పెట్టించాడు. సుమారు 40 ప్యాకెట్ల విత్తనాలు ఉపయోగించాడు. మొదటిరోజు పెట్టిన పదిశాతం గింజలు మొలకెత్తాయి. రెండవ రోజు పెట్టిన గింజలు ఒక్కటి కూడా మొలకెత్తలేదు. వర్షం పడితే మళ్లీ పూర్తిస్థాయిలో విత్తనాలు పెట్టించాలని అనుకుంటున్నాడు.

- ముఖం చాటేసిన వరుణుడు
- వాడుతున్న పత్తి మొక్కలు
- బిందెలు, ట్యాంకర్లతో నీరు అందిస్తున్న రైతులు
- చాలా చోట్ల మొలకెత్తని గింజలు
- ఇప్పటివరకు లక్ష ఎకరాల్లో పత్తి సాగు

వర్షాలు లేక గుండాలలో వాడుబట్టిన పత్తి మొక్కలు



రామన్నపేట: సీజన్ ప్రారంభంలోనే పత్తి రైతులకు పరేషాన్ మొదలైంది. పత్తి మొక్క ఎదగాల్సిన సమయంలోనే వరుణుడు ముఖం చాటేశాడు. దీనికి తోడు సగానికిపైగా రైతులు పెట్టిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఆలస్యంగా దుక్కులు సిద్ధం చేసుకున్న వారు విత్తనాలు పెట్టేందుకు వర్షం రాకకోసం ఎదురుచూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 63.01 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 83.09 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అయినా గత పది రోజుల నుంచి అనువైన వర్షాలు కురవకపోవడంతో పత్తి మొక్కలు వాడుబడుతున్నాయి.

మొక్కలను రక్షించుకునేందుకు..

జిల్లావ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో 1.35లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని వ్యవసాయ అధికారుల అంచనా వేశారు. ఇప్పటివరకు లక్ష ఎకరాల్లో రైతులు పత్తి గింజలు విత్తుకున్నారు. నైరుతి రుతుపవనాల కారణంగా వానాకాలం సీజన్ ఆరంభానికి ముందే రోహిణి కార్తెలో వర్షాలు కురిసాయి. అప్పటికే వేసవి దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్న రైతులు సాగుకు అనుకూలంగా నేల తడవడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తడం జరిగింది. సంస్థాన్ నారాయణపురం, మోటకొండూరు, వలిగొండ, రామన్నపేట, అడ్డగూడూరు, గుండాల, వలిగొండ, చౌటుప్పల్, మోత్కూరు మండలాల్లో రైతులు పత్తిని అధికంగా సాగు చేశారు. చాలా వరకు పత్తిగింజలు మొలకెత్తాయి. ప్రస్తుతం వర్షాలు కురువడం లేదు. అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసినా మొక్కలకు కావలసిన తేమను అందించలేకపోయాయి. నాలుగైదు రోజులుగా మండుతున్న ఎండలకు మొలకెత్తిన మొక్కలు వాడిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో విత్తిన విత్తనాలు మొలకెత్తకుండా భూమిలోనే ఉండిపోయాయి. భూమిలోని వేడికి మాడిపోతున్నాయి. రామన్నపేట, అడ్డగూడురు, మోత్కూరు, గుండాల మండలాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. మొక్కలను రక్షించుకునేందుకు కొన్ని ప్రాంతాల్లో బిందెలతో నీరు పోస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో డ్రిప్ పైపులతో నీరు అందిస్తున్నారు. మరో మూడు నాలుగు రోజులు ఇలానే ఎండలు ఉంటే పత్తి మొక్కలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. వర్షాలు కురిస్తే మొలకెత్తని చోట తిరిగి విత్తనాలు పెట్టించాలని రైతులు భావిస్తున్నారు. అంతేకాకుండా మరో 30వేల ఎకరాల్లో పత్తి సాగు చేసే అవకాశం ఉంది.



రామన్నపేట: అంబబావిగూడెంలో పత్తి మొక్కలకు నీళ్లు పోస్తున్న మహిళ

ముమ్మరంగా వీయూపీ సర్వే

చౌటుప్పల్‌లో మొదలైన అండర్‌పాస్ నిర్మాణ ప్రక్రియ

- ప్రతి 400ఫీట్లకు పాయింట్‌గా విభజించి సర్వే చేస్తున్న కన్సల్టెన్సీ
- రెండు నెలల క్రితమే పూర్తయిన సాయిల్ టెస్టింగ్



చౌటుప్పల్ బస్టాండ్ వద్ద రోడ్డు లెవలింగ్ చూస్తున్న కన్సల్టెన్సీ ఉద్యోగి

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో హైదరాబాద్– విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై చేపట్టిన వెహికిల్ అండర్‌పాస్ (వీయూపీ) నిర్మాణ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. రూ.114.40కోట్ల అంచనా వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ఈ పనులు చేపట్టింది. ఈ ఏడాది మార్చిలో టెండర్లు ఆహ్వానించగా హరియాణా రాష్ట్రానికి చెందిన ఓ సంస్థ టెండర్‌ను దక్కించుకుంది. నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన వివిధ రకాల సర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఇప్పటికే ముగిసిన సాయిల్ టెస్టింగ్

టెండర్ ప్రక్రియ ముగియగానే పనులు మొదలయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్ 15న సాయిల్ టెస్టింగ్ ప్రారంభించి వారం రోజులపాటు నిర్వహించారు. బ్రిడ్జి నిర్మాణానికి పిల్లర్ల పటిష్టత కోసం భూమిలో ఉన్న మట్టి నాణ్యతను తెలుసుకున్నారు. ఒక్కోచోట 100– 150ఫీట్ల లోతు వరకు పరీక్షించారు. సేకరించిన మట్టి నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసలు కాకుండా ఆరు వరుసలకు అనుగుణంగా అండర్‌పాస్ నిర్మాణం జరగనుంది. ఆప్రకారంగానే సాయిల్ టెస్టు కూడా నిర్వహించారు.

తాజాగా ప్రారంభమైన లెవలింగ్ సర్వే

అండర్‌పాస్ బ్రిడ్జి ప్రారంభమయ్యే పాయింట్ నుంచి ముగింపు వరకు లెవలింగ్ సర్వే పనులను గురువారం చేపట్టింది. ప్రస్తుతం రహదారి ఏ ప్రాంతంలో ఏ లెవల్‌లో ఉంది, బ్రిడ్జి నిర్మాణానికి ఏ మేరకు లేవల్ సరిచేయాల్సి ఉంటుందనే విషయాన్ని సర్వే చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం జరిగే ప్రాంతంలో ప్రతి 400ఫీట్లకు ఒకచోట పాయింట్ నిర్ణయించి సర్వే నిర్వహిస్తున్నారు.

18ఫీట్ల ఎత్తు నుంచి నిర్మాణం

భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు పక్కాగా అడుగులు వేస్తున్నారు. పట్టణంలో ఆర్టీసీ బస్‌స్టేషన్, తంగడపల్లి–చిన్నకొండూర్ చౌరస్తా, వలిగొండ క్రాస్‌రోడ్ ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు నుంచి 18ఫీట్ల ఎత్తుపై అండర్‌పాస్ నిర్మాణం జరగనుంది. ఇరువైపులా ప్రతి 30ఫీట్లకు ఒక పిల్లర్ రానుంది. మొత్తంగా పరిశీలిస్తే భూమి నుంచి అండర్‌పాస్ బ్రిడ్జి (వీయూపీ) వద్ద సుమారుగా 23–25ఫీట్ల ఎత్తు వరకు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

టోల్‌ప్లాజా అధికారులపై ఆర్‌ఓ ఆగ్రహం



బీబీనగర్‌లోని అండర్ పాస్ వద్ద రహదారిని పరిశీలిస్తున్న ఆర్‌ఓ రజాక్

బీబీనగర్: మండల పరిధిలోని వరంగల్– హైదరాబాద్ జాతీయ రహదారి నిర్వహణ, మరమ్మతుల విషయంలో గూడూరు టోల్‌ప్లాజా అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో నేషనల్ హైవే అథారిటీ రీజనల్ అధికారి(ఆర్‌ఓ) రజాక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన జాతీయ రహదారి వెంట నిర్వహణ తీరు, కల్వర్టుల వద్ద పరిస్థితులు, అండర్ పాస్‌లను పరిశీలించారు. బీబీనగర్ మండల కేంద్రంలోని రహదారి వెంట ఉన్న కల్వర్టుల వద్ద, సర్వీస్ రోడ్ల వెంట పనులు అసంపూర్తిగా ఉండడం, కల్వర్టుల వద్ద సరైన నిర్వహణ లేకపోవడంతో టోల్‌ప్లాజా జీఎం తేజోనిధిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

రామగిరి(నల్లగొండ): వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడాల గ్రామానికి చెందిన తీగల జానకమ్మ(38) గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వేములపల్లి మండలం సల్కునూరు గ్రామానికి చెందిన జానకమ్మకు మామిడాల గ్రామానికి చెందిన వెంకన్నతో 20 సంవత్సరాల క్రితం వివాహం అయింది. భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కొడుకు, కుమార్తె ఉన్నారు. నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం జానకమ్మ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. జానకమ్మ తల్లి బచ్చలకూరి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ డి.రాజు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వలిగొండ : అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం స్థానిక పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ సాదక్ అనే వ్యక్తి అశోక్ లేలాండ్ వాహనంలో సుమారు 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని భువనగిరికి తరలిస్తుండగా వలిగొండ పట్టణ శివారులో పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కేసు వివరాలు అడిగినందుకు దాడి

నల్లగొండ క్రైం : కేసు వివరాలు అడిగినందుకు అడ్వకేట్ అల్వాల వసంతరావు తనపై దాడి చేశాడని ఆరోపిస్తూ నల్లగొండ పట్టణానికి చెందిన చామల నవీన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. ఓ వ్యక్తి డబ్బులు ఇవ్వకుండా తనను ఇబ్బంది పెడుతున్న విషయమై 2015లో కేసు నమోదు చేయించినట్లు నవీన్‌కుమార్ తెలిపారు. 2018లో తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, ఆ తర్వాత ఏం చేయాలో అడ్వకేట్ తనకు చెప్పడం లేదన్నారు. ఈ విషయమై కార్యాలయానికి వెళ్లి అడిగితే తనపై గురువారం దాడి చేశాడని పేర్కొన్నారు. నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు అడ్వకేట్‌పై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ పట్టణ టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్ కుమార్



స్వామి వివేకానంద ఫార్మసీ కళాశాలలో మాట్లాడుతున్న ఏసీపీ రమేష్ కుమార్

యాదగిరిగుట్ట రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్ కుమార్, యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్ అన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలోని శ్రీ స్వామి వివేకానంద ఫార్మసీ కళాశాలలో శుక్రవారం డ్రగ్స్ దుర్వినియోగం, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు డ్రగ్స్‌కు బానిసలైతే ఎంతటి నేరాలకైనా వెనకాడరన్నారు. డ్రగ్స్ మానవ శరీరానికి అత్యంత హానికరమని, మానసిక క్షీణతకు దారి తీస్తుందన్నారు. విద్యార్థు లు మత్తుకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కే. ఉదయ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. కే. హేమామాలిని, డా. మత్స్యగిరి, వేణుగోపాల్ రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాపాయస్థితిలో పేదింటి చిన్నారి

- ప్రాణాలు దక్కాలంటే లివర్ మార్చాలన్న వైద్యులు
- లివర్ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన కన్న తల్లి
- ఆపరేషన్‌కు రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందన్న ఆస్పత్రి నిర్వాహకులు
- ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న తల్లిదండ్రులు


ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో బాలుడు

కన్నీటి గాథ

చౌటుప్పల్ : పేదింటి చిన్నారికి పెద్ద కష్టం వచ్చింది. తొమ్మిది నెలల వయస్సులో ప్రాణాపాయస్థితిలో ఉన్నాడు. లక్షల రూపాయలు వెచ్చించి వైద్యం అందిస్తేగాని ప్రాణాలు దక్కని పరిస్థితి. మనసున్న మారాజులు ముందుకు వచ్చి తోచినంత సాయం అందించాలని చిన్నారి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

పుట్టినప్పటి నుంచే అనారోగ్య సమస్యలు

చౌటుప్పల్ మండల పరిధిలోని చిన్నకొండూర్ గ్రామానికి చెందిన నూనె రమ్య–వెంకటేశ్ దంపతులకు కుమార్తె అశ్రిత, కుమారుడు అయాన్ష్(9 నెలలు) ఉన్నారు. రమ్య ఇంటి వద్దనే ఉంటుండగా, ఆమె భర్త వెంకటేశ్ నిత్యం హైదరాబాద్‌కు వెళ్లి రోజువారీ పనులు చేస్తుంటాడు. తొమ్మిది నెలల క్రితం ఈ దంపతులకు కుమారుడు అయాన్ష్ జన్మించాడు. ఆ సమయంలోనే బాలుడికి అనారోగ్య సమస్యలు తలెత్తాయి. దాంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించారు. కొంతకాలం పాటు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తలేదు. అయితే రెండు నెలల క్రితం బాలుడికి కామెర్లు వచ్చాయి. దాంతో బాలుడు మరోసారి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. తల్లిదండ్రులు బాలుడిని హైదరాబాద్‌లోని లక్డికాపూల్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలుడి ప్రాణాలు దక్కాలంటే లివర్ మార్పిడి చేయాలని చెప్పారు.

కామెర్ల వ్యాధితో బాధపడుతున్న బాలుడు

తన కుమారుడిని ఎలాగైనా కాపాడుకోవాలని తల్లిదండ్రులు రకరకాల ప్రయత్నాలు చేశారు. అందిన దగ్గరల్లా అప్పు చేశారు. ప్రాథమిక వైద్యం కోసమే సుమారు రూ.5లక్షల వరకు ఖర్చు చేశారు. తొమ్మిది నెలలుగా కుమారుడి ఆరోగ్యం కోసం చేసిన ప్రయత్నాలు ఒక ఎత్తు అయితే ఆపరేషన్ విజయవంతం చేయడం మరోఎత్తుగా మారింది. ప్రస్తుతం కామెర్ల వ్యాధి కారణంగా చిన్నారికి కడుపు బాగా ఉబ్బిపోయి ఉంది. ప్రస్తుతం కడుపులోని నీరును బయటకు తీస్తున్నారు. నీరంతా బయటకు వచ్చి చిన్నారి మామూలు స్థితికి వచ్చాక లివర్ మార్పిడి ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ణయించారు. బాలుడి కన్నతల్లి రమ్య లివర్ ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. ఆది లేదా సోమవారం ఆపరేషన్ చేసే అవకాశాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అందుకోసం సుమారు రూ.25–30 లక్షల వరకు ఖర్చు అవుతుందంటున్నారు. అంత ఖర్చు భరించే స్థోమత లేకపోవడంతో చౌటుప్పల్‌లోని ప్లాటును సైతం విక్రయించారు. ఆ డబ్బు కూడా సరిపోకపోవడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

మనసున్న మారాజులు ముందుకురావాలి



"మా బిడ్డను కాపాడుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాం. కానీ మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఆస్తులు అమ్ముకుంటున్నా పూర్తిస్థాయిలో వైద్యం అందించలేకపోతున్నాం. మా బాబు ప్రాణాలు దక్కాలంటే లివర్ మార్పిడి చేయాలి. మనసున్న మారాజులు ముందుకు వచ్చి ఆదుకోవాలని చేతులు జోడించి వేడుకుంటున్నాం. గూగుల్/ ఫోన్‌పే 9640174585 నంబర్‌కు సాయం అందించాలి.

–నూనె రమ్య, బాలుడి తల్లి

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

రామన్నపేట : మండలంలోని ఇంద్రపాలనగరం పెద్దచెరువులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి (54) మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన జాలరులు శుక్రవారం చేపలు పట్టేందుకు చెరువు వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో చెరువులో నుంచి చేపలు బయటకు వెళ్లకుండా అడ్డుగా కట్టిన వలలకు చిక్కుకున్న మృతదేహం వారికి కనిపించింది. పుంటికూర శంకరయ్య అనే వ్యక్తి ఫోన్ ద్వారా స్థానిక పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే రసూల్‌కు సమాచారం అందించారు. కార్యదర్శి ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చెరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఏ1 ఫెసిలిటీ అండ్ ప్రాపర్టీ మేనేజర్ ప్రైవేటు లిమిటెడ్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే దానాపూర్ వారు ఇచ్చిన 0356 నంబర్ గుర్తింపు కార్డును ధరించి ఉన్నాడు. కార్డుపై ఉచిత్ పాశ్వాన్ తండ్రి రామ్‌లవన్ పాశ్వాన్, భగ్‌వాన్‌పూర్ పీఎస్ దామరూన్ అని చిరునామా ఉంది. మృతుడు బ్లూ కలర్ షర్ట్, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే రసూల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పి.మల్లయ్య తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 8712662487 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

పురాతన ఆలయాలను పరిరక్షించాలి


పురాతన శివాలయాన్ని పరిశీలిస్తున్న పురవాస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

కేతేపల్లి: పురాతన ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామంలో ఆదరణకు నోచుకోక శిథిలావస్థకు చేరిన రెండు పురాతన శివాలయాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 800 ఏళ్ల క్రితం కాకతీయ రాజులు నిర్మించిన అపురూప ఆలయాలు, అద్భుత శిల్పాలు ఆలనాపాలన లేక నిరాదరణకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక చరిత్ర, సంస్కృతికి అద్దంపడుతున్న వారసత్వ కట్టడాలను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. రెండు ఆలయాల చుట్టూ పెరిగిన ముళ్ల పొదలను తొలగించి, పడిపోయిన రాళ్లను యథా స్థానంలో పునర్నిర్మిస్తే ఆలయాలు అలనాటి వైభవాన్ని సంతరించుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట స్థపతి భీమిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఈమని రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన మైనర్లు

- వెంబడించి పట్టుకున్న స్థానికులు

మిర్యాలగూడ : ఇద్దరు మైనర్లు ఓ వ్యక్తి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని వెళ్లిన సంఘటన దామరచర్ల మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన గుండా బాలసైదయ్య స్థానికంగా కిరాణ షాపు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మిర్యాలగూడకు చెందిన ఓ బాలుడు బాల సైదయ్య కిరాణ దుకాణానికి వచ్చి వాటర్ బాటిల్ అడిగాడు. బాల సైదయ్య వాటర్ బాటిల్ లేదని చెబుతుండగానే ఆ బాలుడు బాలసైదయ్య మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని సమీపంలో స్కూటీపై ఉన్న మిర్యాలగూడకు చెందిన మరో మైనర్‌తో కలిసి అక్కడి నుంచి జారుకున్నారు. బాలసైదయ్య వెంటనే కేకలు వేయడంతో స్థానికులు గమనించి పారిపోతున్న సదరు మైనర్లను వెంబడించి మిర్యాలగూడ మండలం కిష్టాపురం సమీపంలో పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కాగా చోరీకి పాల్పడిన వారు మిర్యాలగూడ పట్టణంలో ఇంటర్మీడియట్ చదువుతున్నట్లు సమాచారం. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

భువనగిరి క్రైం : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన భువనగిరి పట్టణంలోని బాహర్‌పేట్‌లో చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకం శ్రీనివాస్ (50) భువనగిరి పట్టణంలోని పెద్దవాడ కట్టులో నివసిస్తూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం బాహర్‌పేట్‌లోని పోచమ్మ గుడిలో బోనాల ఉత్సవాల సందర్భంగా లైట్లు వేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అంకం శ్రీనివాస్ భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చండూరు : మండలంలోని బంగారిగడ్డ గ్రామ శివారులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బంగారిగడ్డ గ్రామ శివారులో నల్పరాజు అంజయ్య వ్యవసాయ భూమిలో పలువురు పేకాడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి నల్పరాజు అంజయ్య, కొన్‌రెడ్డి జీవన్‌కుమార్, ఇరిగి నగేష్, మేడిపల్లి భిక్షం, బొడ అంజయ్య, ఆది రాజు, మాదగోని రాజు, పాలెం స్వామిలను పట్టుకున్నారు. 52 పేకముక్కలు, రూ.2980 నగదు, 6 సెల్‌ఫోన్లు, 8 బైక్‌లను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది ఉపేంద్రచారి, సురేష్, ఆనందరెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి లోడ్‌తో వెళ్తున్న కంటెయినర్‌లో మంటలు


జేసీబీతో పత్తిని కిందకు తీస్తున్న ఫైర్ సిబ్బంది

యాదగిరిగుట్ట రూరల్: పత్తి లోడ్‌తో వెళ్తున్న కంటెయినర్‌లో మంటలు చెలరేగిన సంఘటన యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ నుంచి పత్తిని డ్రైవర్ కంటెయినర్ లో నింపుకుని గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్ వైపు వెళుతోంది. ఈ క్రమంలో యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామ శివారులోకి రాగానే కంటెయినర్ నుంచి పొగలు రావడం ప్రారంభమయ్యాయి. గమనించిన స్థానికులు కంటెయినర్ డ్రైవర్‌కు విషయం తెలిపారు. డ్రైవర్ దిగి కంటెయినర్ డోర్ తీసి చూడగా అందులో పత్తి కాలుతూ కనిపించింది. స్థానిక ఫైర్ స్టేషన్‌కు డ్రైవర్‌కు సమాచారం తెలపడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపులోనికి తీసుకువచ్చారు. మిగిలిన పత్తిని జేసీబీ సహాయంతో కింద పడేశారు. ఈ ప్రమాదంలో కంటైనర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు. పత్తి సగం వరకు కాలిపోయింది. కంటెయినర్‌లో పత్తికి, ఐరన్‌కు మధ్యలో రాపిడి జరిగి ప్రమాదం జరిగి ఉంటుందని, ఫైర్ సిబ్బంది భావిస్తున్నారు.

క్వారీ నుంచి ఇసుక రవాణా నిలిపివేత

- లారీలను వెనక్కి పంపించిన అధికారులు


ఇసుక క్వారీ వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి

శాలిగౌరారం: మండలంలోని వంగమర్తి శివారులో మూసీ ప్రాజెక్టు పరిధిలో ప్రభుత్వ అనుమతితో జరుగుతున్న ఇసుక డీ షిల్టింగ్ ప్రాంతాన్ని నల్లగొండ ఆర్డీఓ రవి, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మూసీ ప్రాజెక్టు పరిధి నుంచి తీస్తున్న ఇసుక, టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఇసుక రవాణా కోసం భారీ సంఖ్యలో బారులుదీరిన లారీలు, వారు పొందిన ఇసుక రవాణా అనుమతి రశీదులను పరిశీలించారు. ఇసుక రవాణాలో అవకతవకలకు పాల్పడుతున్నారంటూ వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని క్వారీని సందర్శించినట్లు ఆర్డీఓ, డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఇసుక తరలింపు పూర్తిగా నిలిపి వేయాలని టీఎస్ఎండీసీ సిబ్బందికి సూచించారు. ఇదిలా ఉండగా ఇసుక లోడ్ కోసం టీఎస్ఎండీసీకి డీడీలు చెల్లించి వచ్చామని, ఇప్పుడు ఇసుక లోడ్ చేయకపోగా తాము చెల్లించిన డీడీల సొమ్ము తిరిగి ఇవ్వాలని లారీల యజమానులు ఆర్డీఓ, డీఎస్పీని కోరారు. ఇసుక కోసం చెల్లించిన డబ్బులు తిరిగి సంబంధిత లారీల యజమానుల బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. వారివెంట తహసీల్దార్ ఎండీ అన్వర్‌హుస్సేన్, శాలిగౌరారం సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ ఎం.నవీన్‌కుమార్‌లు ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వలిగొండ : అప్పుల బాధ భరించలేక ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని రెడ్లరేపాక గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోర్క నరేష్ (31) అనే రైతు రెడ్లరేపాకలో 4 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట సాగుచేశాడు. దిగుబడి రాక, పత్తి పంట సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక గురువారం తన వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. రాత్రి వరకు నరేష్ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెతకగా వ్యవసాయ క్షేత్రం వద్ద పురుగుల మందు తాగి పడిపోయి ఉండడాన్ని గమనించారు. చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ శుక్రవారం తెలిపారు.

వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరి

డిండి : వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని ఎస్‌ఐ రాజు వాహనదారులకు సూచించారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ చౌరస్తా వద్ద టూ వీలర్ వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని ప ది ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలు సీజ్

త్రిపురారం : నంబర్ ప్లేట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడిపితే కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తామని త్రిపురారం ఎస్‌ఐ వీర శేఖర్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ సక్రమంగా లేకుండా రోడ్డుపై తిరుగుతున్న 13 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఎస్‌ఐ వీర శేఖర్ మాట్లాడుతూ.. వాహనాల పత్రాలను వాహనదారులు అందుబాటులో ఉంచుకోవాలి, తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ విధిగా ధరించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

పట్టపగలే దొంగల హల్‌చల్

- రెండు తులాల బంగారం, రూ.80 వేల నగదు చోరీ
- ఇద్దరు దొంగలు పరారీ.. మరో దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఇంటి యజమాని


నేరేడుచర్ల : భూపాల్‌రెడ్డి ఇంట్లో బీరువాలోని వస్తువులను చిందరవందర చేసిన దొంగలు

నేరేడుచర్ల: పట్టపగలే దొంగలు హల్‌చల్ చేసిన సంఘటన శుక్రవారం నేరేడుచర్ల మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. బాధితుడు భూపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని శివాలయం రోడ్డులో నివాసం ఉండే యలంచెరువు భూపాల్‌రెడ్డి తన భార్య నాగలక్ష్మితో కలిసి ఉదయం పూట ఇంటికి తాళం వేసి పాలకీడు గ్రామ సమీపంలో పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేరని గమనించిన గుంటూరు జిల్లా కారంపూడికి చెందిన బాబావలి, మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేటకు చెందిన గొల్ల మహేష్, పవన్ ముగ్గురు కలిసి భూపాల్‌రెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టారు. మహేష్ అనే వ్యక్తి ఇంట్లోకి వెళ్లగా పవన్, బాబావలిలు బయట కాపలాగా ఉన్నారు. ఆ ఇంటి పరిసరాలకు ఎవరూ రాకపోవడంతో బయట ఉన్న ఇద్దరు కూడా ఇంట్లోకి వెళ్లి బీరువా తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న వస్తువులను చిందరవందర చేశారు. బీరువాలో ఉన్న రూ.80 వేలతోపాటు రెండు తులాల విలువ గల మూడు బంగారు ఉంగరాలు, రెండు జతల దిద్దులు, ముక్కుపుడక దొంగలించారు. ఈ క్రమంలో పొలం పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన భూపాల్‌రెడ్డి దంపతులు ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించారు. ఇంట్లో దొంగలు ఉన్న విషయం గుర్తించిన భూపాల్‌రెడ్డి దంపతులు అప్రమత్తంగా కాగా మహేష్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. మరో ఇద్దరు పరారీ అయ్యారు. కాలనీవాసులు అక్కడికి చేరుకుని మహేష్‌ను చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగించారు. కాగా పరారీ అయిన ఇద్దరు దొంగల వద్దనే దొంగిలించబడిన వస్తువులు ఉండడం గమనార్హం. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నకిరేకల్ : పట్టణంలోని సంతోష్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌లోని సంతోషనగర్‌లో నివాసం ఉంటున్న ఆర్‌ఎంపీ నారగోని సుదర్శన్ గురువారం మధ్యాహ్నం వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. కుటుంబీకులు వారి బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం సుదర్శన్ తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టబడి ఉంది. ఇంట్లో బీరువాలో దాచిన రూ.2లక్షల నగదు, ఆరు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని సుదర్శన్ తెలిపాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితుడు తెలిపాడు.

ఏరువాక వైభవం.. సాగు సంబురం

- ఎడ్లు, వ్యవసాయ పనిముట్లకు రైతన్నలు పూజ చేసే పండుగ
- వేడుకతో పొలం పనులు ప్రారంభం
- నేడు ఏరువాక పౌర్ణమి


హాలియాలో ఏరువాక సందర్భంగా ఎడ్లకు పూజ చేసి వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతు

హాలియా : తొలకరి పిలుపు.. రైతన్న మోములో చిరునవ్వు.. పిల్ల కాలువల గెంతులాట.. పుడమి తల్లి పులకరింతకు సాక్ష్యమే ఏరువాక పౌర్ణమి. ఆధునిక వ్యవసాయం ఎంత ముందుకు సాగినా నాగలి లేనిదే పని జరగదు. రైతు లేనిదే పూట గడవదు. అలాంటి వ్యవసాయానికి సంబంధించిన పండుగే ఏరువాక పౌర్ణమి. వైశాక మాసం ముగిసి జ్యేష్ఠ మాసం మొదలైన తర్వాత వర్షాలు కురవడం మొదలవుతాయి. జ్యేష్ఠ పౌర్ణమి నాటికి తొలకరి వర్షం పడి భూమి మెత్తబడుతుంది. దుక్కి దున్నడం, వ్యవసాయ పనులను ప్రారంభించడం ఏరువాకతోనే ప్రారంభమవుతుంది.

ఏరువాక అంటే..

అన్నదాతలు వైభవంగా జరుపుకునే పండుగ ఏరువాక పౌర్ణమి. ఏటా జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమ నాడు జరుపుకునే వేడుక. ఏరు అంటే ఎద్దులను నాగలికి కట్టి దున్నడానికి సిద్ధం చేయడం అని అర్థం. ఈరోజు రైతులు కాడెద్దులను కడిగి వాటి కొమ్ములకు రంగులు పూసి, మెడలో గజ్జెలు, గంటలతో అలంకరిస్తారు. ఎడ్లకు కట్టే కాడిని ధూపదీప నైవేద్యాలతో పూజించి, ఎద్దులకు భక్ష్యాలు తినిపిస్తారు. పొలాలకు వెళ్లి భూతల్లికి పూజలు నిర్వహిస్తారు. రైతులు దుక్కి దున్నడం ప్రారంభిస్తారు.

రుతుపవనాల రాకతో..

ఏరువాకను జ్యోతిష్య, శాస్త్రవేత్తలు కృష్యారంభం, సస్యారంభం అని వ్యవహరిస్తారు. దేశంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఈ వేడుక జరుపుకుంటారు. జ్యేష్ఠ మాసంలో మొదలయ్యే నైరుతి రుతుపవనాల ప్రభావం దేశమంతా ఒకేలా ఉంటుంది. దేశంలో దాదాపు 80 శాతం వర్షపాతం నైరుతి వల్లే కురుస్తుంది. పాడిపంటలకు, పొలం పనులకు ఆటంకాలు ఎదురు కావొద్దని కోరుకుంటూ ఏరువాకను మహా యజ్ఞంలా పరిగణిస్తారు. నాగేటి సాళ్లల్లో సీత దొరికింది కాబట్టి సీతా యజ్ఞంగాను భావిస్తారు. మరో విశేషం ఏమిటంటే ఈ రోజే ఒడిశాలోని పూరీ జగన్నాథుడికి స్నానోత్సవం నిర్వహిస్తారు.

అతి ప్రాచీనమైన పండుగ..

ఏరువాక అతి ప్రాచీనమైన పండుగ. ఈ రోజు శ్రీకృష్ణదేవరాయలు రైతుల కృషిని అభినందించి తగిన రీతిలో వారిని ప్రోత్సహించినట్లు పురాణాలు చెబుతున్నాయి. అలాగే శుద్ధోధన రాజు కపిలవస్తులో లాంఛనంగా ఏరువాకను ప్రారంభిస్తూ బంగారు నాగలిని రైతులకు అందించినట్లు కథలున్నాయి. ఈ సంవత్సరం ఏరువాకతో వ్యవసాయానికి సిద్ధమయ్యే రైతులకు ధాన్యపు సిరులు కురవాలని ఆశిద్దాం.

ఏరువాక పౌర్ణమితో దున్నడం ప్రారంభిస్తాం



ఏరువాక పౌర్ణమి రోజు రైతులందరం వ్యవసాయ పనిముట్లకు, భూదేవికి, ఎడ్లకు పూజలు చేస్తాం. నాగలి కట్టి దుక్కలు దున్నడం ప్రారంభిస్తాం. వర్షాలు అనుకున్నట్లు పడితే వ్యవసాయ సాగుకు ఎలాంటి ఢోకా ఉండదు.

–రాయనబోయిన కొండల్, రైతు, పేరూర్